క్లుప్తంగా

నియామకం

మన్సూరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా మన్సూరాబాద్‌కు చెందిన చందునాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర చైర్మన్ ఆర్.జగన్‌లాల్ నాయక్ జారీ చేసిన నియామక ఉత్తర్వులను కేంద్ర మాజీ మంత్రి బలరామ్ నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ సోమవారం ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా గాంధీనాయక్ మాట్లాడుతూ... తన నియామకానికి సహకరించిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్, సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి, ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ నిర్మాణాలను ఆపండి

చైతన్యపురి: డివిజన్‌లో పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయా లని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి కోరారు. ప్రతి కాలనీలో అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవటం లేదని ఆరోపించారు. ఈ మేరకు జోనల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నిర్మాణ సమయంలో రోడ్లపై బిల్డింగ్ మెటీరియల్ వేస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. భారీ వాహనాలు రావటం వల్ల మ్యాన్‌హోల్స్ పాడైపోతున్నాయని జెడ్‌సీకి వివరించారు. వెంటనే అక్రమ నిర్మాణాలను గుర్తించి నోటీసులు జారీ చేయాలని, నిబంధనలకు లోబడి జరగని నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ కోరారు.

నల్లా బకాయిలు చెల్లించకుంటే కనెక్షన్ కట్

చాదర్‌ఘాట్: జలమండలి ఎండీ ఆదేశాల మేరకు నల్లా బకాయిల వసూలుకు అధికారులు మంగళవారం నుంచి స్పెషల్‌డ్రైవ్ చేపట్టనున్నారు. మలక్‌పేట సబ్ డివిజన్ పరిధిలో రూ. 20 కోట్లు బకాయిలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. డివిజన్ పరిధిలో కమర్షియల్ కనెక్షన్‌లు 1444 ఉండగా, బకాయిలు రూ. 6 కోట్లు ఉన్నాయి. అదేవిధంగా డొమెస్టిక్ కనెక్షన్‌లు 21,842 ఉండగా బకాయిలు రూ. 14 కోట్లకు చేరాయి. బకాయిల వసూలు కోసం వాటర్‌వర్క్స్ నుంచి నాలుగు బృందాలు తిరుగుతున్నట్లు తెలుస్తోంది. కమర్షియల్ కనెక్షన్‌లు ఉన్నవారికి ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా స్పందించడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. పై అధికారుల ఒత్తిడితో ఏమి చేయాలో అర్థం కావడంలేదని సిబ్బంది అంటున్నారు. పోలీసుల సహకారం తీసుకొని అయినా బకాయిలు వసూలు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. దాదాపు 20 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో స్పెషల్ డ్రైవ్ చేస్తున్నారు. ఈ విషయమై జలమండలి మలక్‌పేట సబ్ డివిజన్ డీజీఎం షీలారాణి వివరణ కోరగా... రూ. 20 కోట్ల బకాయిలు ఉన్నమాట వాస్తవమేనని తెలిపారు. బకాయిలు ఉన్నవారికి నోటీసులు జారీ చేశామని స్పందించకుంటే కనెక్షన్‌లు తొలగిస్తామని ఆమె హెచ్చరించారు.

పెంపుడు పిల్లిని ఎత్తుకెళ్లాడు!

హస్తినాపురం: పెంపుడు పిల్లిని గుర్తు తెలియని వ్యక్తి ఎత్తుకెళ్లిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిదిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... చింతలకుంట జహంగీర్‌కాలనీలో నివాసం ఉంటున్న ఎస్.కె.గజాన మహ్మద్(22) థాయిలాండ్‌లోని కాహో మనీ బ్రీడ్‌కు చెందిన పిల్లిని కొనుగోలు చేశారు. ఆదివారం రాత్రి పిల్లి ఇంట్లో నుంచి బయటకు వెళ్లడంతో స్కూటీపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి పిల్లిని ఎత్తుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యంకు డబ్బివ్వలేదని యువకుడి ఆత్మహత్య

నాగోలు: మద్యం సేవించేందుకు డబ్బులు ఇవ్వడం లేదని ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... మాన్సూరాబాద్ ఎరుకల నాంచారమ్మ కాలనీకి చెందిన లక్ష్మికి కుమారుడు తాండూరి సురేష్(24), ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త రాములు గతంలో చనిపోయాడు. సురేష్ డబీల్‌పూరా పోలీస్ స్టేషన్ సమీపంలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. తాగుడుకు బానిసగా మారాడు. పనిచేయగా వచ్చిన డబ్బులతో మద్యం సేవించేవాడు. అంతేగాకుండా మద్యం కోసం మరిన్ని డబ్బులు కావాలంటూ తల్లి, చెల్లెళ్లను వేధించసాగాడు. డబ్బులు ఇవ్వనందుకు వారిపై దాడికి దిగేవాడు. ఈ క్రమంలో సురేష్ ఆదివారం మధ్యాహ్నం మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. డబ్బులు కావాలంటూ తల్లి, చెల్లెళ్లతో గొడవకు దిగాడు. సురేష్ వేధింపులు తట్టుకోలేక వారి ఇంటి నుంచి బయటకు వెళ్లారు. మద్యం మత్తులో ఉన్న సురేష్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆదివారం రాత్రి రూమ్‌లోకి వెళ్లి రేకుల కింద ఉండే ఇనుప కడ్డీకి చున్నీతో ఉరి వేసుకున్నాడు. రాత్రి ఇంటికి వచ్చిన చెల్లి పార్వతి సురేష్ ఉరి వేసుకున్న విషయాన్ని గమనించి స్థానికులకు తెలియజేసింది. సురేష్‌ను కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. సోదరి స్వప్న ఫిర్యాదు మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కంటివెలుగు, బేటీ బచావో, బేటీ పడావోలను...

విజయవంతం చేద్దాం



కార్పొరేటర్లు, అధికారులతో సమీక్ష నిర్వహించిన డీసీ మారుతీ దివాకర్

- కార్పొరేటర్లు, అధికారులతో సమీక్ష
- బృహత్తర పథకాల అమలుపై దిశా నిర్దేశం
- వంద రోజులు కొనసాగనున్న ప్రక్రియ
- కేంద్రాల వద్ద పటిష్ట ఏర్పాట్లు చేయండి
- జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్–3 డీసీ మారుతీదివాకర్

ఎల్‌బీనగర్: వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు చేపడుతున్న కంటి వెలుగు, బేటీ బచావో బేటీ పడావో పథకంను పటిష్టంగా నిర్వహించేందుకు సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలని జీహెచ్‌ఎంసీ ఎల్‌బీ నగర్ సర్కిల్–3 డీసీ మారుతీదివాకర్ అన్నారు. ఈ పథకంపై సర్కిల్ కార్యాలయంలో కార్పొరేటర్లు, అధికారులతో నిర్వహించిన సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ... ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే కంటి వెలుగు పథకాన్ని విజయవంతం చేసేందుకు ఆయా డివిజన్‌లలో ఏర్పాటు చేస్తున్న సెంటర్ల వద్ద తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు కంటి చూపు పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లద్దాల్లు, శస్త్ర చికిత్సలు, మందులు అందించనున్నారు. ఈ ప్రక్రియ వంద రోజులపాటు సాగుతుందన్నారు.

◆ ఈ సదవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగహన కల్పించాలని సూచించారు. బేటీ బచావో బేటీ పడావో అనేది బాలికల సంక్షేమం, విద్య కోసం కేంద్ర ప్రభుత్వం తెచ్చిన పథకమని పేర్కొన్నారు. స్త్రీ, పురుష లింగ తారతమ్యాలను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటారని డీసీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

◆ స్త్రీలు అన్ని రంగాల్లో సాధికారిత సాధించే వరకు ఈ పథకం వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ రెండు పథకాల అమలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తుగా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు.

◆ ఆయా కేంద్రాల వద్ద ప్రజలకు తగు వసతులు కల్పించాలని ఆదేశించారు.

◆ సమావేశంలో కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, చింతల అరుణ, నవజీవన్‌రెడ్డి, అధికారులు బలరాం, వైద్యాధికారి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

12న నేషనల్ స్పిరిట్‌వాక్

పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



మన్సూరాబాద్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఈ నెల 12న బండ్లగూడలోని ఇందు అరణ్య నుంచి ప్రారంభమయ్యే నేషనల్ స్పిరిట్‌వాక్ 2023ని విజయవంతం చేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆటోనగర్‌లోని మహావీర్ హరిణ వనస్థలి జాతీయ పార్కు (డీర్ పార్కు)లో సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ నెల 12న ఉదయం 5.30 గంటలకు స్పిరిట్ వాక్ ప్రారంభం అవుతుందన్నారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత, మహిళలు, వాకర్స్ అధిక సంఖ్యలో పాల్గొని వాక్‌ను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, పోచబోయిన జగదీష్‌యాదవ్, డీర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయేందర్‌రెడ్డి, సునిల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో మెరుగైన వసతులు కల్పించాలని వినతి



నాగోలు: రాష్ట్ర స్థాయిలో పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్ హాస్టళ్లలో అన్ని జీవోలను పూర్తి స్థాయిలో అమలు చేయాలి, క్లాస్ 4 ఉద్యోగులను జీవో 49, 9 లను సవరణ చేయాలని, మెరుగైన వసతులు కల్పించాలని ఎస్సీ స్టూడెంట్ హాస్టల్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కుమార్ కోరారు. ఈ మేరకు మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను సోమవారంకలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ... పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లలో జీవోలు 49, 9 ప్రకారం టెండర్ కాంట్రాక్ట్ వర్కర్ల పనితీరు సరిగా లేనందున హాస్టళ్లలో విద్యార్థులకు సరైన భోజనం అందడం లేదన్నా హాస్టళ్లకు ట్రాయిలెట్స్, పరిసరాలు శుభ్రంగా లేవని, వాచ్‌మెన్ తన విధులను సరిగా నిర్వహించడం లేదన్నారు. వెంటనే జీవోలను సవరణ చేయాలని, దీన్ని ఔట్ సోర్సింగ్ లేదా కాంట్రాక్ట్ పద్ధతి ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి హాస్టల్‌కు అమలు చేయాలని కోరారు.

వడ్డెరల సమస్యల పరిష్కారానికి కృషి

మన్సూరాబాద్: తెలంగాణ వడ్డెర సంఘం అండ్ చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శిగా మన్సూరాబాద్‌కు చెందిన పల్లపు దుర్గయ్యను నియమించారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, చైర్మన్ శివరాత్రి అయిలమల్లు నియామక పత్రాన్ని సోమవారం ఎల్‌బీనగర్‌లో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా దుర్గయ్య మాట్లాడుతూ... వడ్డెర కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో మాల మార్పిడి వేడుక

నాగోలు: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా 25వ రోజు సోమవారం తెల్లవారు జామున కొత్తపేట డివిజన్ స్నేహపురికాలనీ శ్రీ గోదాసమేత పద్మావతీ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ, భక్తులు మాల మార్పిడి వేడుకను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గోదాదేవి మందిరంలో పాడిచేటి విజయలక్ష్మి తిరుప్పావై పాశురం విశేషాలను వివరించారు. అనంతరం గోదాదేవి పూలమాల తీసుకుని భక్తులు వేళతాళాలతో, భక్తి గీతాలు పాడుతూ కోలాటాలాడుతూ సమీపంలోని శ్రీకృష్ణ మందిరానికి చేరుకున్నారు. శ్రీ కృష్ణ మందిర కమిటీ చైర్మన్ యాదిరెడ్డి, సభ్యులు వారికి స్వాగతం పలికారు. శ్రీ కృష్ణ మందిరంలో గోదాదేవి మందిరానికి తీసుకొచ్చారు. అమ్మవానికి ఆ మాలను అలకించి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వారణాశి వంశీ, కార్యదర్శి ప్రసన్న కృష్ణ, హేమసుందర్ రావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపోత్సవం



స్వామి వారికి హారతి ఇస్తున్న లక్ష్మీదేవి

మలక్‌పేట: ధనుర్మాస తిరుప్పావై ప్రవచనోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి మూసారంబాగ్ ఆండాళ్ నిలయంలో దీపోత్సవం భక్తి శ్రద్ధలతో జరిపారు. ఈ సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి భక్తులు హారతి, మంగళ శాసనం చేశారు. ఆలయ నిర్వాహకురాలు ఎ.లక్ష్మీదేవి మాట్లాడుతూ... 11 తేదీన కూడార్తై ఆండాళ్ తల్లికి నీరాటోత్సవం, 108 గంగాళాలతో అక్కర వడిశల్ ప్రసాద నివేదన వితరణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రూపాదేవి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ వార్షికాదాయ లక్ష్యం సాధ్యమయ్యేనా?

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి సీజన్ ప్రారంభమై నెలరోజులు కావస్తోంది. దానికి తోడు ఉల్లి సీజన్ కూడా మొదలయింది. ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023లోపు మార్కెట్ ఫీజుల వార్షికాదాయం రూ. 12 కోట్లుగా అధికారులకు లక్ష్యం నిర్దేశించారు. ఇప్పటి వరకు మార్కెట్‌కు ఫీజుల రూపంలో సమకూరిన ఆదాయం కేవలం రూ. 6 కోట్ల 75 లక్షలు మాత్రమే అని అధికారుల ద్వారా తెలుస్తోంది. ఇంకా రూ. 5 కోట్ల మేర మార్కెట్ ఫీజులు రానున్న రెండు నెలల్లో వసూలు చేయటం సాధ్యమేనా అని అధికార వర్గాల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. లక్ష్యం చేరేందుకు అధికారులు మార్కెట్‌లో హడావుడి చేస్తున్నారు. ఇందుకుగాను మార్కెట్ వ్యాపారులతో ఇటీవల తరచూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. రెండు నెలల్లో అధికారులు లక్ష్యాన్ని చేరుకుంటాలో లేదో వేచిచూడాలి.

వరకట్న వేధింపులకు వివాహిత బలి...

భర్త, అత్తకు పదేళ్లు, మరిదికి ఏడేళ్ల జైలు శిక్ష

- ఏడాదిన్నర చిన్నారికి నిప్పంటించిన తల్లి
- తానూ నిప్పంటించుకున్న బాధితురాలు
- ఎనిమిది రోజులు మృత్యువుతో పోరాడి మరణించిన వివాహిత

రంగారెడ్డిజిల్లాకోర్టులు: వివాహిత బలవన్మరణానికి కారకులైన భర్త, అత్తకు పదేళ్ల జైలు శిక్ష, మరిదికి ఏడేళ్ల కారాగారం శిక్ష విధిస్తూ రంగారెడ్డి జిల్లా 11వ అదనపు జిల్లా కమ్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి వై.జయప్రసాద్ తీర్పు చెప్పారు. 11వ అదనపు జిల్లా కమ్ సెషన్స్ కోర్టు ఏపీపీ హొద్యారపు రవి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... 2015వ సంవత్సరం మే నెలలో మైలార్‌దేవ్‌పల్లి ఠాణా పరిధిలో వరకట్న వేధింపులు.. వివాహిత తన కుమార్తె ఆత్మహత్య కేసు నమోదైంది. నవనీత(21) అనే మహిళ తన అత్త, మామ, మరిదిల వేధింపులు తాళలేక బలవన్మరణానికి పాల్పడింది. ఈ కేసులో మృతురాలి భర్త గడుసు కుమార్ అలియాస్ కొమురయ్య(29), అత్త గడుసు ఆండాళు(50), మామ గడుసు నరసింహా, మరిది గడుసు శ్రీనివాస్‌లు మృతురాలిని అదనపు కట్నం కోసం వేధించారు. తన తండ్రి ఆరోగ్య రీత్యా తాను తనఖా పెట్టిన బంగారం విడిపించమని పుట్టింట్లో వదిలేయగా బంగారం విడిపించినా కూడా తిరిగి తీసుకెళ్లకపోగా సూటి పోటి మాటలతో మానసిక క్షోభకు గురిచేశారు. ఈ పరిణామాలతో జీవితంపై విరక్తి చెందిన నవనీత తన నివాసం దగ్గరలోని వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి తన కూతురైన ఏడాదిన్నర పసికందు నిహారికపై కిరోసిన్‌తో నిప్పటించింది. ఆ పసికందు అక్కడిక్కడే ప్రాణాలు వదలింది. అనంతరం తాను కూడా కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుని తన ఇంటివైపు పరుగులు తీయడాన్ని గమనించిన దగ్గరి బంధువు మంటలను ఆర్పి చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఎనిమిది రోజులు మృత్యువుతో పోరాడిన నవనీత ప్రాణాలు విడిచింది. ఈ మేరకు మృతురాలు నవనీత తండ్రి ఐలైయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను రిమాండుకు తరలించారు. 14వ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు ద్వారా నవనీత మరణ వాంగ్మూలాన్ని నమోదు చేశారు. వాగ్మూలంలో నవనీతను తన భర్త, అత్త, మామ, మరిది తనపై అనుమానంతో తనని మానసికంగా, శారీరకంగా చిత్రహింసలకు గురిచేశారని పేర్కొంది. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యాధారాలు, మృతురాలు నవనీత మరణ వాగ్మూలాన్ని పరిశీలించిన న్యాయమూర్తి సోమవారం పైమేరకు తీర్పు చెప్పారు. నలుగురు నిందితుల్లో ఒకరు ఇదివరకే మరణించగా మిగతా ముగ్గురికి శిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెలువరించారు.

పెండింగ్ పనులపై దృష్టి సారించండి

మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: నియోజకవర్గం పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు.. ఆయా పనుల్లో నెలకొన్న జాప్యం, సత్వరమే పూర్తి చేసే విషయంపై సోమవారం పంజేషాహలోని కార్యాలయంలో మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అధికారులు, కార్పొరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. అసంపూర్తి పనులపై దృష్టి సారించి వాటిని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డివిజన్లలో కొత్త పనులకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఆయా పనులను పూర్తిచేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అక్బర్‌బాగ్ సయ్యద్ మినాజుద్దీన్, ఎంఐఎం అధ్యక్షుడు షఫీయుద్దీన్, జీహెచ్‌ఎంసీ ఈఈ మహబూబ్‌మియా, ఏడీఈ ప్రదీప్‌కుమార్, ఏఈ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళా భద్రతలో షీ టీమ్స్ కీలకపాత్ర

- 24 గంటలూ పనిచేస్తుంది
- రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

నాగోలు: మహిళల భద్రత భరోసా కల్పించడంతో షీ టీమ్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని రాచకొండ పోలీస్ కమీషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. సోమవారం ఎల్‌బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయం వద్ద ఉన్న రాచకొండ షీ టీమ్స్ కార్యాలయాన్ని సీపీ సందర్శించారు. ఈ సందర్భంగా షీ టీమ్స్ సిబ్బందితో మాట్లాడి వారికి దిశా నిర్దేశం చేశారు. ఆకతాయిల పట్ల కఠినంగా వ్యవహరించాలని, రాచకొండ పరిధిలో మహిళలు ఎలాంటి వేధింపులకు గురికాకుండా భద్రత కల్పించాలన్నారు. ఆకతాయిల పట్ల ఆలసత్యం వహించకుండా వెంటనే కేసులు నమోదు చేయాలని సూచించారు. మహిళలు, బాలికలకు సురక్షిత వాతావరణాన్ని ఏర్పాటు చేసేందుకు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ డెకాయ్ ఆపరేషన్స్ చేపట్టాలన్నారు. సోషల్ మీడియా వేదికల ద్వారా మహిళలను సైబర్ స్టాకింగ్‌కు, వేధింపులకు గురిచేస్తున్న వారిపైనా దృష్టి పెట్టాలని సూచించారు. ఎలాంటి వేధింపులకు ఎదురైనా మహిళలకు అండగా తామున్నమనే భరోసా కల్పించడానికి, బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సంప్రదించడానికీ విశ్వాసం పెంపొందిచడానికి కృషి చేయాలని సీపీ దిశానిర్దేశం చేశారు. 2023 సంవత్సరానికి సంబంధించిన మహిళలు, బాలిక భద్రత కోసం రోడ్ మ్యాప్‌పై చర్చించారు. 7వ తరగతి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు అన్ని విద్యా సంస్థల్లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. భవిష్యత్తులో మేము కళాశాల నుంచి ఒకరు లేదా ఇద్దరు చురుకైన బాలికలను గుర్తించి వారికి ఆమె కోసం అని పేరు పెట్టడంతో పాటు షీ టీమ్స్ వంటి కార్యక్రమాలలో వారికి శిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ డీసీపీ సన్‌ప్రీంత్‌సింగ్, షీ టీమ్ డీసీపీ షేక్ సలీమా, ఏసీసీ వెంకట్‌రెడ్డి, ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, షీ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌ఐ, పీసీ అభ్యర్థులకు న్యాయం చేసేదాకా పోరు: ఏఐఎస్‌ఎఫ్

నాగోలు: ఎస్‌ఐ, పీసీ నియామక పరీక్ష ప్రశ్నాపత్రంలో తప్పులు ఉన్నాయని, హైకోర్టు తీర్పు మేరకు 7 మార్కులను కలపాలని, రన్నింగ్ క్వాలిఫై అయిన అభ్యర్థులను మెయిన్స్‌కు అవకాశం ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్యార క్రాంతి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ, పీసీ అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాలని చలో ప్రగతి భవన్ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో హస్తినాపురంలో నివాసం ఉంటున్న గ్యార క్రాంతికుమార్‌ను ఎల్‌బీనగర్ పోలీసులు ముందుస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ... దేశంలో ఎక్కడా లేని విధంగా 3.8 నుంచి 4 మీటర్ల లాంగ్ జంప్, 11 మార్కుల విషయంలో ప్రభుత్వమే పొరపాటు చేస్తే ఎలా అని ప్రశ్నించారు. తక్షణం వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఐ, పీసీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

1969 తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు ఏదీ?



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రామరాజు

వనస్థలిపురం: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తమకు గుర్తింపు లేకుండా పోయిందని 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు పేర్కొన్నారు. సోమవారం వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లో 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రహరి రామరాజు తదితరులు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు 1969 ఉద్యమమే మూలమని, దాని స్ఫూర్తితోనే మలిదశ ఉద్యమంతో తెలంగాణ కల సాకారం అయిందన్నారు. అయితే అప్పటి ఉద్యమకారులకు నేడు గుర్తింపు లేదని, ముఖ్యమంత్రి కేసీఆర్ అపాయింట్‌మెంట్ కూడా దొరకడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తాము అందరం 70 ఏళ్లకు పైబడిన వారమేనని వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నామని అన్నారు. తమను తెలంగాణ సమరయోధులుగా గుర్తించాలని, అర్హులైన వారికి గౌరవప్రదమైన పింఛన్ ఇవ్వాలని, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ నెల 21న రవీంద్ర భారతిలో 1969 ఉద్యమకారుల సభను నిర్వహిస్తున్నామని, ఈ సభకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు హాజరవుతున్నారని వారు తెలిపారు. ఉద్యమకారులు అధికసంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మేచినేని కిషన్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రావు, వనం చంద్రమౌళి, చంద్రారెడ్డి, కృష్ణమూర్తి, లక్ష్మారెడ్డి, వెంకటయ్య, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు భళా

- సందడిగా సంక్రాంతి ముగ్గుల పోటీలు
- నేత్రపర్వంగా ముగ్గులు వేసిన మహిళలకు బహుమతుల ప్రదానం



శారదానగర్‌లో ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలు, బాలికలు

వనస్థలిపురం: సంక్రాంతి పండగను పురస్కరించుకుని కళాభారతి సాహితీ, సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వనస్థలిపురం శారదానగర్‌లో శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కన్వీనర్ కొప్పోలు జగన్నాథరావు మాట్లాడుతూ.. గడచిన రెండు దశాబ్దాలుగా శారదానగర్‌లో ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రసన్నాంజనేయులు, కె.ఎల్.నర్సింహారావు, ఇందిర, టి.యాదగిరిరావు, హరిప్రసాద్, రమాదేవి, అరుణ, జ్యోతిశ్రీ, లలిత, అంజనాదేవి, సువర్చల తదితరులు పాల్గొన్నారు.

సహారాస్టేట్స్ కాలనీలో...

మన్సూరాబాద్: సహారా స్టేట్స్‌కాలనీ మెయింటనెన్స్ కమిటీ ఆధ్వర్యంలో సామ రంగారెడ్డి ఫౌండేషన్ సహకారంతో సహారాస్టేట్స్ కాలనీలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. పోటీల్లో విజేతలకు బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సహారాస్టేట్స్ కాలనీ అధ్యక్షుడు కరణం శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు రాఘవేందర్, కోశాధికారి జగత్‌రెడ్డి కాలనీ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాపోలు విశ్వనాథం, ప్రధాన కార్యదర్శి గంగదాసు కృష్ణారెడ్డి బీజేపీ మన్సూరాబాద్ అధ్యక్షుడు నాంపల్లి రామేశ్వర్,, మహిళా మోర్చా రంగారెడ్డి అర్బన్ అధ్యక్షురాలు కృష్ణవేణి, చిల్కూరు మాధవి, కవితా రెడ్డి, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



సహారాస్టేట్స్ కాలనీలో విజేతలకు బహుమతులను అందజేస్తున్న సామ రంగారెడ్డి, కార్పొరేటర్ నర్సింహారెడ్డి